# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

సిటీలో పెరిగిన నేరాలు

రికవరీలోనూ పెరుగుదల

కోర్టు మానిటరింగ్ సిస్టమ్‌తో పెరుగుతున్న శిక్షల శాతం

చట్టాన్ని గౌరవించే వారితోనే ఫ్రెండ్లీ పోలీసింగ్

హైదరాబాద్ కమిషనరేట్ వార్షిక క్రైమ్ రివ్యూలో

సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి




వార్షిక సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ వార్షిక క్రైమ్ నివేదికను శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, నగర పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పౌరుల భద్రతే లక్ష్యంగా 24/7 పోలీసులు పనిచేస్తున్నామన్నారు. 2023లో జరిగిన ప్రధాన పండుగలు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలన్ని ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామన్నారు. చట్టాన్ని గౌరవించే వారితో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుందని, చట్టాన్ని అతిక్రమించే వారితో కఠినంగా ఉంటామని సీపీ వివరించారు. హైదరాబాద్‌లో డ్రగ్స్ వాడేవారితో పాటు డ్రగ్స్ విక్రయించే వారిని ఉక్కుపాదంతో అణిచివేస్తామని, పటిష్ట నిఘాను ఏర్పాటు చేశామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 350 కేసులు నమోదు చేసి, రూ. 36.81 కోట్ల నగదును సీజ్ చేశామన్నారు. నేరాలు పెరిగినా, శిక్షల శాతం (20 శాతం) పెరగడం సంతృప్తిగా ఉన్నదని సీపీ అన్నారు. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ బాగా పనిచేస్తుందన్నారు. వచ్చే ఏడాది శిక్షల శాతాన్ని మరింత పెంచే లక్ష్యంతో పనిచేస్తామన్నారు. మహిళలపై లైంగిక దాడులు గతేడాదితో పోలిస్తే 12 శాతం పెరిగాయన్నారు. పిల్లలపై దాడులు, పోక్సో కేసుల సంఖ్య 12 శాతం తగ్గిందనీ, సైబర్ నేరాలు 12 శాతం పెరిగాయన్నారు.

## పెరిగిన రికవరీ శాతం

ఈ ఏడాది మొత్తం సిటీలో 22,214 కేసులు నమోదయ్యాయి. గతేడాది వీటి సంఖ్య 21,381 ఉన్నది. కేసుల్లో రికవరీ శాతం గతేడాది 60.07 శాతం ఉండగా.. ఈ ఏడాది 74.15 శాతం పెరిగింది. 7,137 కేసులను పరిష్కరించగా, అందులో 4,465 కేసుల్లో శిక్షలు పడ్డాయి. శిక్షల శాతం 63 శాతం ఉన్నదని సీపీ వెల్లడించారు. 13 కేసుల్లో 13 మందికి జీవిత ఖైదు శిక్షలు పడ్డాయన్నారు. ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల్లో రూ. 9,675 కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. హెచ్‌న్యూ ఆధ్వర్యంలో 83 కేసులు ఛేదించినట్లు సీపీ వివరించారు. ట్రాఫిక్ విభాగంలో 37,866 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు స్వల్పంగా పెరిగాయన్నారు. సైబర్‌నేరాలు గతేడాది 2,457 ఉండగా.. రూ. 82 కోట్ల ఆర్థిక నష్టం జరిగిందని, ఈ ఏడాది 2,735 కేసులు నమోదు కాగా.. అందులో రూ. 133.59 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని వివరించారు.

### ప్రధానమైన నేరాల వివరాలు.. 2022-2023

| నేరాలు | 2022 | 2023 |
|---|---|---|
| సొత్తు కోసం హత్యలు | 5 | 2 |
| బందిపోటు | 9 | 14 |
| దోపిడీలు | 108 | 91 |
| దొంగతనాలు | 3188 | 3091 |
| హత్యలు | 71 | 79 |
| ఉద్దేశం లేకుండా జరిగే మరణాలు(కల్పబుల్ హోమిసైడ్) | 11 | 7 |
| లైంగిక దాడులు | 343 | 403 |
| దాడులు | 12 | 14 |
| కిడ్నాపులు | 191 | 242 |
| గొడవలు | 1573 | 1700 |
| మోసాలు | 1753 | 4297 |
| నమ్మక ద్రోహం | 4582 | 4909 |
| నకిలీ కరెన్సీ | 4 | 4 |
| హత్యాయత్నాలు | 222 | 262 |
| రోడ్డు ప్రమాదాలు | 2417 | 2637 |
| ఇతర నేరాలు | 5379 | 5588 |

## 58 మంది పోలీసులపై చర్యలు

ప్రస్తుతం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచే బాధ్యతలు నిర్వహిస్తున్నామన్నారు. ఇక నుంచి వారంలో రెండు రోజులు బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయం నుంచి విధులు నిర్వహిస్తానని సీపీ తెలిపారు. ప్రజలకు మరింత దగ్గర కావాలనే ఉద్దేశంతోనే పాత కమిషనరేట్ కార్యాలయం నుంచి సేవలు అందిస్తామన్నారు. అలాగే, ఓల్డ్‌సిటీలోని ఓల్డ్ కమిషనరేట్ కార్యాలయానికి మరమ్మతులు జరుగుతున్నాయని, పనులు పూర్తయితే అక్కడికి కూడా గత కమిషనర్లు వెళ్లినట్లు వెళ్తానన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నెలా 16 వేల వరకు కొత్త వాహనాలొస్తున్నాయని, వాటికి తగ్గట్టుగా ట్రాఫిక్‌లో ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. 2023లో నగరంలో పనిచేస్తున్న పోలీసులపై వచ్చిన ఫిర్యాదులతో 8 మందిని ఉద్యోగంలో నుంచి తొలగించగా.. 50 మందిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి కన్వాయ్ వెళ్తున్నప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సీఎం చెప్పారని, అయితే.. సీఎం భద్రత ప్రధానమైందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొత్త సంవత్సరం వేడుకలపై నిఘా ఉంటుందని, రోడ్లపైకి వచ్చి హంగామా చేయవద్దని సీపీ సూచించారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు.



వివరాలను వెల్లడిస్తున్న మేడ్చల్ జోన్ డీసీపీ శబరీష్

## గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 22: ఒడిశా నుంచి పుణెకు హైదరాబాద్ మీదుగా గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. 272 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ జోన్ డీసీపీ శబరీశ్ శుక్రవారం పేట్ బషీరాబాద్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మేడ్చల్ జోన్ ఎస్ఓటీ, శామీర్‌పేట పోలీసులు ఉమ్మడిగా చేపట్టిన తనిఖీల్లో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. రెండు కార్లలో ఒడిశా నుంచి పుణెకు హైదరాబాద్ మీదుగా గంజాయిని తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు శామీర్‌పేట ఓఆర్ఆర్ టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టి, నిందితులను పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో మహారాష్ట్రకు చెందిన యోగేశ్ రాయ్‌సింగ్(29), దినాకర్ నారలె(26), చరణ్‌లాలా సింధా(31), యోగిరాజ్ సంజయ్(23), చైతన్యతుహర్(19), రాహుల్ కంటిలాల్(19) ఉన్నారు. ప్రధాన నిందితులైన సంజు, అప్పలు పరారీలో ఉన్నారు. పట్టుబడిన నిందితుల నుంచి ఎండు గంజాయితో రెండు కార్లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## క్రెడిట్ కార్డు పరిమితిని పెంచుతామంటూ..

వెంగళరావునగర్, డిసెంబర్ 22: క్రెడిట్ కార్డు పరిమితిని పెంచుతామని నమ్మబలికిన సైబర్ నేరగాళ్లు రూ.94 వేలు కాజేశారు. మధురానగర్ పోలీసుల కథనం మేరకు.. రహ్మత్‌నగర్‌కు చెందిన సౌండ్ ఇంజినీర్ కాలూరి నాగరాజు (38)కు గురువారం ఓ ఫోన్ కాల్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి తాను ఆర్.బి.ఎల్. క్రెడిట్ కార్డు డిపార్ట్‌మెంట్ నుంచి కాల్ చేస్తున్నానని చెప్పాడు. క్రెడిట్ కార్డు పరిమితిని పెంచుతామని, అందుకు ఓ లింక్ పంపుతామని చెప్పారు. బాధితుడు ఆ లింక్ క్లిక్ చేయడంతో ఐదు దఫాలుగా బ్యాంకు ఖాతాల్లో నుంచి మొత్తం రూ.94,080 పోయాయి. సైబర్ క్రిమినల్స్ చేతుల్లో మోసపోయిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఆరో అంతస్తులో అగ్నిప్రమాదం

ఖైరతాబాద్, డిసెంబర్ 22: ఓ అపార్టుమెంట్‌లోని ఆరో అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు సకాలంలో స్పందించడంతో ఆ కుటుంబం ప్రాణాపాయం నుంచి తప్పించుకొని బయటపడింది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.1 ప్రధాన రహదారిపై ఉన్న మాలిక్ అపార్ట్‌మెంట్స్‌లోని ఆరో అంతస్తులో అక్కడే పనిచేసే కుటుంబం నివసిస్తున్నది. శుక్రవారం వారు నివసించే గదిలో ఒక్కసారిగా మంటలంటుకొని దట్టమైన పొగలు వ్యాపించాయి. చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారమివ్వగా, పోలీసులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పంజాగుట్ట ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రావణ్ కుమార్, లా అండ్ ఆర్డర్ కానిస్టేబుళ్లు సత్యనారాయణ, దశరథ రామిరెడ్డి పై అంతస్తుకు చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. శ్రావణ్ కుమార్ ధైర్యం చేసి ఆ గది తలుపులు పగులగొట్టి ఓ దివ్యాంగుడితో పాటు నలుగురిని రక్షించాడు. సెక్రటరియేట్, బేగంపేట, సనత్‌నగర్ నుంచి మూడు ఫైరింజన్లను తెప్పించి మంటలను ఆర్పివేశారు. పోలీసులు సకాలంలో స్పందించడం, మంటల వ్యాపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఐదుగురిని రక్షించిన పోలీసు కానిస్టేబుళ్లను అధికారులు అభినందించారు.

## చిట్టీల పేరుతో చీటింగ్.. రూ.అరకోటి స్వాహా

వెంగళరావునగర్, డిసెంబర్ 22 : చిట్టీల పేరుతో జనం నుంచి భారీగా డబ్బులు వసూలు చేసిన చీటర్ దంపతులు నిలువునా ముంచేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన ఎన్.కవిత చిట్టీల వ్యాపారి. అదే ప్రాంతానికి చెందిన టైలరింగ్ చేసే మహ్మద్ ఫాతిమా బేగంకు 2020లో చిట్టీల కవిత పరిచయమైంది. టైలరింగ్‌తో వచ్చే డబ్బుతో చిట్టీలు వేయాలని, మంచి సంపాదన ఉంటుందని కవిత చెప్పింది. దీంతో ఫాతిమా రూ. రెండు లక్షల రెండు చిట్టీలు వేసింది. అన్ని వాయిదాలు (రూ.5,64,000) చెల్లించింది. చిట్టీలు పూర్తయిన తర్వాత కవిత డబ్బులు ఇవ్వలేదు. డబ్బుల కోసం అడుగగా.. వాయిదాలు పెడుతూ, మూడుసార్లు ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చింది. గడువు ముగియడంతో డబ్బులు అడిగితే.. చంపేస్తామంటూ కవిత, ఆమె భర్త హనుమంతు బెదిరించారు. ఫాతిమా నుంచే కాకుండా సున్నపు కవిత, లక్ష్మి, జి.నాగమ్మ, పి.పార్వతి, డి.అశోక్ నుంచి రూ.40 లక్షల మేరకు వసూలు చేశారు. ఇంకా ఎంతో మంది నుంచి చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేసి ఆస్తులు సంపాదించుకున్నారు. డబ్బు తిరిగి చెల్లించాలని బాధితులు అడిగితే, ఎస్టీ కులం పేరుతో దూషించారు. కేసులు పెడుతామంటూ బాధితులను బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## నగరంలో డ్రగ్స్ దందా

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బెంగళూరు కేంద్రంగా నగరంలో డ్రగ్స్ దందా నడుపుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర డ్రగ్స్ విక్రయదారులను ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.3 లక్షల విలువజేసే 30 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నేరెడ్‌మెట్‌లోని రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్ బాబు కేసు వివరాలను వెల్లడించారు. రాజమండ్రికి చెందిన వీరం నాగేశ్వర్ ఉపాధి కోసం నగరానికి వలసొచ్చి, కూకట్‌పల్లిలో 'షేక్స్ ఎన్ స్లైస్'లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సూర్యాపేట జిల్లాకు చెందిన కె.జితేందర్ ఉపాధి కోసం నగరానికి వలసొచ్చి, ఫిల్మ్‌నగర్‌లో నివాసముంటూ డబ్బింగ్ సౌండ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ మంచి స్నేహితులు. ఇద్దరూ డ్రగ్స్‌కు అలవాటు పడ్డారు. నాగేశ్వర్‌కు బెంగళూరులో ఉంటున్న నైజీరియా దేశానికి చెందిన డ్రగ్స్ వ్యాపారితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి నైజీరియన్ వద్ద నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను కొనుగోలు చేసి, నగరంలో రూ.8 వేల నుంచి 10 వేలకు గ్రాము చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నాలుగు రోజుల కిందట ఇద్దరు నిందితులు కలిసి ప్రైవేటు బస్సులో బెంగళూరు వెళ్లారు. అక్కడ నైజీరియన్ వద్ద నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి, నగరానికి తిరిగి వచ్చారు. గురువారం సాయంత్రం వనస్థలిపురంలోని ఆటోనగర్‌లో డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు వనస్థలిపురం పోలీసులతో కలిసి నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేసి, సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

కెనరా బ్యాంక్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
సిండికేట్ Syndicate
హైదరాబాద్ అబిడ్ రోడ్ శాఖ,
14-1-954, మొదటి అంతస్తు, మెయిన్‌రోడ్, అబిడ్స్,
హైదరాబాద్-500001. ఫోన్: 040- 23438631,7382932142,
ఇ-మెయిల్ id:cb0606@canarabank.com

అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

శ్రీమతి శ్రీ సావిత్రి నాయర్ మరియు శ్రీ కోమలం మరియు మెస్సర్స్ ఆశ్రయ్ యాడ్స్ నుండి కెనరా బ్యాంక్, హైదరాబాద్ అబిడ్ రోడ్ శాఖ , హైదరాబాద్‌కు బకాయి రూ.32,53,145.92/- (ముప్పై రెండు లక్షల యాభై మూడు వేల నూట నలభై ఐదు రూపాయల తొంభై రెండు పైసలు మాత్రమే) + 02-02-2023 నుండి దానిపై వర్తించని వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలు రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జ్ చేయబడిన, కెనరా బ్యాంక్, హైదరాబాద్ అబిడ్ రోడ్ శాఖ , హైదరాబాద్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి 29.01.2024న "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన విక్రయించబడుతుందని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

(A) ఆస్తి కొరకు రిజర్వు ధర: రూ.55,31,200/- (యాభై ఐదు లక్షల ముప్పై ఒక్కవేల రెండు వందల రూపాయలు మాత్రమే) మరియు బయానా డిపాజిట్: రూ. 5,53,120/- (ఐదు లక్షల యాభై మూడు వేల నూట ఇరవై రూపాయలు మాత్రమే)

బయానా డిపాజిట్‌ను 26.01.2024న లేదా ఆలోగా సా|| 5.00 గం.లోగా డిపాజిట్ చేయాలి.

స్థిరాస్తి వివరణ: తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, మలక్‌పేట్ వద్దగల మున్సిపల్ ఇంటి నెం. 16-2-701/1 కలిగిన ఆవరణలో MJR క్లాసిక్‌గా పిలువబడే కాంప్లెక్స్‌లో 4వ అంతస్తుపై నివాస ఫ్లాట్ నం. 404 యావత్తు మరియు నివాస ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ మరియు Tot లాట్, తూర్పు: ఖాళీ, పడమర: కారిడార్ & ఫ్లాట్ నం. 403.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com)లో ఏర్పాటు చేసిన "E-Auction" లింక్ రిఫర్ చేయండి లేదా ఏదేని పనిరోజున కార్యాలయ వేళలలో సంప్రదించండి: చీఫ్ మేనేజర్, శ్రీ సత్య రత్న, చీఫ్ మేనేజర్ కెనరా బ్యాంక్, హైదరాబాద్, అబిడ్ రోడ్ శాఖ, హైదరాబాద్. ఫోన్ నం. 040-23438631, 7382932142.

తేది: 22-12-2023, ప్రదేశం: హైదరాబాద్ — అధీకృత అధికారి, కెనరా బ్యాంక్.